పొంచి ఉన్న ప్రమాదం

- గాలి దుమారానికి పడుతున్న హోర్డింగ్‌లు
- నాలుగు మున్సిపాలిటీల్లో 36 హోర్డింగ్‌ల ఏర్పాటు

మహబూబాబాద్ : వ్యాపార ప్రచారానికి పలు కంపెనీలు హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. వాటిని ఆస్పత్రులు, పెద్ద పెద్ద అంతస్తులపై నెలకొల్పుతున్నారు. హోర్డింగ్‌ల వల్ల మున్సిపాలిటీలకు ఆదాయం వచ్చినా అవి పకడ్బందీగా ఉన్నాయా! లేవా అనే విషయాన్ని టీపీఎస్ అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. ఇవేమి లేకపోవడంతో చిన్నపాటి గాలిదుమారానికే ఊడి పడున్నాయి.

జిల్లా కేంద్రంలో ఎక్కువగా ఏర్పాటు

మానుకోట, తొర్రూర్, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీలతో పాటు, ఇటీవల కేసముద్రం కూడా మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా కేంద్రంలోనే 18 హోర్డింగ్‌లు ఏర్పాటు చేయగా తొర్రూర్ మున్సిపాలిటీ-6, డోర్నకల్-2, మరిపెడ-10 హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు రైల్వేస్టేషన్ సమీపంలో, ప్రధాన కూడళ్లల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని వెంకట్రామా థియేటర్ ఎదుట ఊడిపడిన హోర్డింగ్

దరఖాస్తు చేసే విధానం

హోర్డింగ్ ఏర్పాటునకు ఇంటి యజమాని అనుమతి పత్రం, కంపెనీ సంబంధించిన లెటర్, టీపీఎస్ ద్వారా స్పైరో మీటర్‌కు రూ.90 చొప్పున అనుమతి రుసుంతో పాటు పన్ను చెల్లించాల్సి ఉంది. వాటి అనుమతి బాధ్యత టీపీఎస్‌దే. ప్రభుత్వానికి సంబంధించిన ప్రచారానికి పన్ను ఉండదు. హోర్డింగ్ ఏర్పాటు ద్వారా మున్సిపాలిటీలకు ఆదాయం వస్తుంది. మానుకోట, తొర్రూర్ మున్సిపల్‌కు మాత్రమే రెగ్యులర్ టీపీఎస్‌లు ఉన్నారు. తొర్రూర్ టీపీఎస్‌నే డోర్నకల్‌కు ఇన్‌చార్జ్ ఉండగా మరిపెడకు ఖమ్మం జిల్లా టీపీఎస్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు.

ఊడిపోతున్న హోర్డింగ్‌లు

చిన్నపాటి దుమారానికి జిల్లా కేంద్రంలో వెంకట్రామా థియేటర్ దారిలో వెంకటేశ్వర నిలయంపై ఉన్న హోర్డింగ్ ఊడి పక్క భవనంపై పడింది. అదే కనుక కింద పడితే పెనుప్రమాదం జరిగే ఉండేది. అలాగే బంధం చెరువు రోడ్డు పక్కన, తొర్రూర్ రోడ్డులో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు కిందపడ్డాయి.

పరిశీలించాకే అనుమతి

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 18 హోర్డింగ్‌లు ఉండగా అన్నింటికి అనుమతి ఉంది. వాటి ద్వారా పన్ను రూపంలో ఆదాయం వస్తుంది. అన్నీ పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తున్నాం. పన్ను చెల్లించకపోతే ముందుగా నోటీస్ ఇచ్చి ఆ తర్వాత వాటిపై ఉన్న ప్రచార ఫ్లెక్సీలను తొలగిస్తున్నాం.

- ప్రవీణ్, టీపీఎస్

క్లుప్తంగా

అనాథలకు సాయం చేయాలి



మహబూబాబాద్ అర్బన్ : సమాజంలోని పేద పిల్లలకు, అనాథాశ్రమానికి సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. లక్ష్మణ్ నాయక్ కోరారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్ర రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పిడికెడు బియ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ నాయక్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అన్నపూర్ణ, శ్రీనివాస్, ఐక్యూసీ కోఆర్డినేటర్ అనిల్, అధ్యాపకులు కాశీమ్, సుమలత, నరేష్, నాగరాజు, ఉదయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహావీర్ జయంతి



డోర్నకల్ /గార్ల : జైనుల ఆరాధ్య దైవం మహావీర్ జయంతి వేడుకలను మెయిన్ రోడ్డులోని జైన్‌మందిర్‌లో జైన మతస్తులు గురువారం నిర్వహించారు. మహావీర్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. మహావీర్ జయంతిని పురస్కరించుకుని ప్రజలకు మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



మరిపెడ రూరల్ /డోర్నకల్ / దంతాలపల్లి : స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లో గురువారం దిగంబర జైన్ సమాజ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. బ్యాంక్ స్ట్రీట్‌లోని వివిధ బ్యాంకులకు నిత్యం వందలాది మంది వస్తూ తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో దిగంబర్‌జైన్ ప్రతినిధులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామంలో దారా ఉప్పలయ్య జ్ఞాపకార్థంగా జన వికాస ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జన వికాస సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర చలివేంద్రాన్ని ప్రారంభించారు. కాగా దంతాలపల్లి మండలంలోని రేపోని గ్రామంలో బాలవికాసఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీఓ అప్సర్‌పాషా ప్రారంభించారు.

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : ద్విచక్ర వాహనదారుడికి ప్రమాదం జరిగేందుకు కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక గురువారం తెలిపారు. బయ్యారం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ధరావత్ నరేష్ ఈనెల 5వ తేదీన బైక్‌పై మహబూబాబాద్‌కు వస్తున్నాడు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జమాండ్లపల్లికి చెందిన ముస్తఫా తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జమాండ్లపల్లి చెక్ పోస్ట్ వద్ద ముస్తఫా ఒక్కసారిగా తన ద్విచక్ర వాహనాన్ని కుడివైపునకు తిప్పి, ఎదురుగా వస్తున్న నరేష్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరేష్ తలకు, చేతులు, కాళ్లకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. నరేష్ తల్లి బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముస్తఫాపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



బయ్యారం: కొత్తతండాలో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

బయ్యారం : ప్రతి పేదవాడికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. మండలంలోని కొత్తతండాలో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో ఎమ్మెల్యే కనకయ్య భోజనం చేశారు. అనంతరం బయ్యారంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నామాలపాడులో సాంకేతిక సమస్య కారణంగా అర్హులందరికి ఇళ్లు మంజూరు కాలేదని త్వరలో ఇళ్లు వస్తాయన్నారు. తహసీల్దార్ విజయ, ఎంపీడీఓ విజయలక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

గార్ల : దేశంలో పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. గురువారం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన బీఆర్ఎస్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్రంలో సన్నబియ్యం ఇస్తున్నది ప్రధాని నరేంద్రమోదీ అని బీజేపీ నాయకులు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. దమ్ముంటే దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. అంబేడ్కర్ నగర్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన పనులకు, ముల్కనూరులో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం పీఏసీఎస్‌లో 97 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, డీపీఓ హరిప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు, పీఏసీఎస్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే సన్న బియ్యం

చిన్నగూడూరు : పేదల ఆకలి తీర్చేందుకే ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన పిల్లి వీరన్న ఇంట్లో కమలాకర్ భోజనం చేశారు. మారబోయిన వెంకటేశ్వర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్



రోడ్డు రోలర్ నడుపుతున్న ఎమ్మెల్యే మురళీ నాయక్

మహబూబాబాద్ అర్బన్ : ప్రజా సమస్యలు పరిష్కరించడం, అభివృద్ధి పనులు చేయడంలో కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే భూక్య డాక్టర్ మురళీ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్ నుంచి సాయిబాబా గుడి మీదుగా పత్తిపాక, మంగళకాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూక్య డాక్టర్ మురళీ నాయక్ గురువారం ప్రారంభించారు.

మహనీయులకు ఘన నివాళి

మహబూబాబాద్ అర్బన్ : జ్యోతిబా పూలే, అంబేడ్కర్ ఆశయ సాధనకు పోరాడుదామని జేఏసీ చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం మహనీయుల వారోత్సవాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సదానందం, అధ్యాపకులు పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ స్వాతి, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ పరిరక్షణ జేఏసీ ఎన్నిక



మహబూబాబాద్ రూరల్ : వక్ఫ్ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ని మహబూబాబాద్ మహబూబియా మసీదులో గురువారం ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా మహమ్మద్ ఇక్బాల్, అడ్వైజర్స్ కమిటీ సభ్యులుగా మహమ్మద్ ఫరీద్, మహమ్మద్ ఖలీల్, గౌరవ సలహాదారులుగా ముక్తి అలంగిర్, మౌలానా అబ్దుల్ లతీఫ్ రషీదీ, మౌలానా సయీద్ అహ్మద్ రిజ్వీ, అబ్దుల్ హమీద్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులతో పాటు యూత్ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎండీ.అమీర్ ఖాన్‌ను ఎన్నుకున్నారు.

రైతులను దోచుకుంటున్న దళారులు

నెహ్రూసెంటర్ : మిర్చి విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చిన రైతులను దళారులు దోచుకుంటున్నారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్చి రైతులకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో దళారులు చేరి ధరలు తగ్గిస్తున్నారని, దీంతో పాటు చిల్లర కాంటాలతో మిర్చి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. సమావేశంలో కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, పైండ్ల యాకయ్య, బీకుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



గూడూరు: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ అజ్మీ

మహబూబాబాద్ అర్బన్/గూడూరు/నెల్లికుదురు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని గూడూరు సీడీపీఓ నీలోఫర్ అజ్మీ అన్నారు. మండలంలోని సీతానగరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లను సూపర్‌వైజర్ నాగలక్ష్మి, నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు, ఎర్రబెల్లిగూడెం క్లస్టర్ల పరిధిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం నిర్వహించారు. సీడీపీఓ కమలాదేవి, ఏసీడీపీఓలు విజయలక్ష్మి, ఇందిరమ్మ, సూపర్ వైజర్లు నాగమణి, విజయలక్ష్మి, విజయ అలివేలు, సుబోధర, స్వరూప, వెంకటమ్మ పాల్గొన్నారు.

'రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే దేశాభివృద్ధి'

- ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్



కురవి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్

కురవి : రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అయితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మోద్గులగూడెంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నాడని, రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు.అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే తోలుతీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, గ్రామ అధ్యక్షుడు కోడి రాములు, చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, బాదావత్ రామునాయక్, గొల్లపల్లి రజనీకాంత్, బండి శ్రీనివాస్, దయ్యాల శ్రీధర్, శ్రీనివాస్, అవిరెమోహన్‌రావు, మణి, రాజేందర్‌కుమార్,అనిల్, శ్యామల శ్రీనివాస్, అశోక్, వేణు, కిషన్‌నాయక్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ప్రజల మన్ననలతోనే కాంగ్రెస్ పాలన

డోర్నకల్ : కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అన్ని వర్గాల వారి మన్ననలు పొందుతోందని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ పేర్కొన్నారు. సీరోలు మండలం అందనాలపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ అభియాన్‌లో సుధాకర్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, ఆయా మండలాల ఇన్‌చార్జ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఉయ్యాలవాడ, వెన్నారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మహబూబాబాద్ అర్బన్ : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సత్యవతి, ఎమ్మెల్సీ రవీందర్‌రావు



కురవి: మాట్లాడుతున్న రెడ్యానాయక్

- రజతోత్సవ సభను జయప్రదం చేయాలి
- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మహబూబాబాద్ అర్బన్ : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ మహాసభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం మహాసభ వాల్ పోస్టర్‌ను సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ఫరీద్, లూనావత్ అశోక్, రాజు, ఇస్లావత్ కవిత తదితరులు పాల్గొన్నారు.

కురవి : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ విమర్శించారు. గురువారం సీరోలు మండల కేంద్రంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను నమ్మిన ప్రజలు మోసపోయారని తెలిపారు. బీఆర్ఎస్ సభకు 10వేల మందిని తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు. సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తోట లాలయ్య, నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోత్ రవినాయక్, తేజావత్ భోజ్యా నాయక్, పెద్ది వెంకన్న, విజయ్‌పాల్‌రెడ్డి, మోహన్ నాయక్, బీకోజీ నాయక్, హరీష్, అప్పారావు, హైమావతి, అనిల్ రెడ్డి, జలగం వెంకన్న, మామిండ్ల వెంకన్న, యాకూబ్, నరహరి పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కురవి : బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త గ్రామాల్లో కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు యాప సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ బూత్‌లో పార్టీ జెండా ఎగురవేయాలన్నారు. మండల కన్వీనర్ శ్రీరామోజు నాగరాజు, కొణతం పెంటయ్య, బుక్క శంకర్‌రావు, కొణతం వెంకటేష్, సాయికుమార్, వెంకటేష్, ప్రభాకర్, కొత్త వెంకన్న, జిన్నా కృష్ణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

గూడూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని మర్రిమిట్టలో గురువారం మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పేర్లు మార్చి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ విషయాన్ని పార్టీ కార్యకర్తలు బూత్ స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న సన్న బియ్యం, పీఎం ఆవాస్ యోజన పథకాలను వివరించాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వెంకన్న, శ్రీశైలం, మేరెడ్డి సురేందర్, మల్లేష్, మల్లయ్యగౌడ్, నాగరాజు, కత్తి వెంకన్న, భద్రు, బావుసింగ్, వడ్లకొండ యాకయ్యగౌడ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

గూడూరు/ కొత్తగూడ : గూడూరు మండలంలోని బొల్లెపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు టీజీ గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటారు. వారిలో హెచ్.అక్షయ, పాలెపు నాగ మోక్షిత్, సంగెపు సాద్విన్ గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా గురువారం హెచ్‌ఎం ఎస్.ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. అలాగే కొత్తగూడ మండలంలోని దొరవారి వేంపల్లి గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పది మంది విద్యార్థులు గురుకుల సెట్‌లో సీటు సాధించి ప్రతిభ చాటారు. ప్రధానోపాధ్యాయుడు సువర్ణపాక కృష్ణ విద్యార్థులను అభినందించారు.

గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



నెహ్రూసెంటర్ /కేసముద్రం /కొత్తగూడ / బయ్యారం : పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో అధిక ధరలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. గ్యాస్ ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం మోపుతున్నారని మండిపడ్డారు. అలాగే కేసముద్రం మండలంలోని ఇంటికన్నె గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. బయ్యారంలో మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం మాట్లాడారు.

దరఖాస్తుల స్క్రీనింగ్‌పై శిక్షణ

డోర్నకల్ : రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుల స్క్రీనింగ్, లబ్ధిదారుల ఎంపికపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని వార్డు అధికారులు, ఆర్‌పీలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, మేనేజర్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను మండల ప్రత్యేక అధికారి ఏ.నర్సింహామూర్తి తనిఖీ చేశారు. హెల్ప్ డెస్క్ పనితీరును అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం : మున్సిపాలిటీ కేంద్రంలో ముక్తార్ పాపన్న స్తూపావిష్కరణ సభ పోస్టర్లను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు శివారపు శ్రీధర్ మాట్లాడుతూ.. ఈనెల 15న బయ్యారం మండలం కొత్తపేటలో చేపట్టనున్న ముక్తార్ పాపన్న స్తూపావిష్కరణ, బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

దంతాలపల్లి : భద్రాద్రి కొత్తగూడెంలో ఈ నెల 25న జరిగే ఏఐకేఎంఎస్ సదస్సును జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ తొర్రూరు డివిజన్ కమిటీ సభ్యులు జాటోత్ భిక్షపతి కోరారు. మండల కేంద్రంలో గురువారం సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.

విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్ : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలు ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ టౌన్ కార్యదర్శి గుండ్ల రాకేష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రలోని గురువారం మహా సభల వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. మహేష్, వినోద్, ప్రమోద్, ప్రకాశ్, పంకాజ్, మహేష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కేసముద్రం : మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మంగారి తండాలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ రూ.25వేల విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు.

చిన్నారులకు కంటి పరీక్షలు

పెద్దవంగర : మండలంలోని బొమ్మకల్లు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు (రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు రేణుక, అశోక్ మాట్లాడారు. 50 మంది చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దృష్టిలోపం ఉన్నట్లయితే వారికి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తామన్నారు. ఫార్మసిస్ట్‌లు నిర్మల, అక్షిత, అంగన్‌వాడీ టీచర్ అంబిక, యాదమ్మ, కవిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిలుకోడులో చోరీ

డోర్నకల్ : మండలంలోని చిలుకోడు గ్రామంలో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన పొన్నం రంజిత్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. గురువారం గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో రూ.80 వేల నగదు చోరీ చేశారు. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

విద్యార్థులకు ఘన వీడ్కోలు



కేసముద్రం : మండలంలోని కల్వల ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కాలేరు యాదగిరి మాట్లాడారు. హెచ్‌ఎం కళ్లెం వీరారెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం బండారు నరేందర్, ఉపాధ్యాయులు గోపి, స్వరూప, హరిక్రిష్ణ, క్రిష్ణ, శ్రీదేవి, మోహనకృష్ణ పాల్గొన్నారు.

పనులు వెంటనే పూర్తిచేయాలి

మహబూబాబాద్ అర్బన్ : ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు చేపట్టిన మన ఊరు-మన బడి పనులను వెంటనే పూర్తి చేయాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సాయికుమార్, గుగులోత్ సూర్య ప్రకాశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలను వారు గురువారం సందర్శించి, మాట్లాడారు. సురభిసాయి, చరణ్, ప్రవీణ్, వినయ్, పవన్, గణేష్, అజయ్, సుధీర్, నవీన్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

గూడూరు : కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూడాలని డీపీఎం రాజు అన్నారు. మండల కేంద్రంలోని వసుంధర వరి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు అయోధ్యపురం, గాజులగట్టు, బొద్దుగొండ, నాయకపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఐకేపీ ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లు ఇప్పించాలి

నెల్లికుదురు : మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి యూపీఎస్‌లో మన ఊరు-మన బడి పథకంలో నిర్మాణ పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ మండల కేంద్రంలో తనిఖీకి వచ్చిన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు బాధితుడు బొల్లు మురళి గురువారం వినతి పత్రం అందజేశాడు.

సరిహద్దుల ఏర్పాటు

దంతాలపల్లి : మండలంలోని పెద్దముప్పారంలో వక్ఫ్ బోర్డు భూములకు సరిహద్దులు నిర్ణయించినట్లు తహసీల్దార్ రాజేశ్వర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ఖబరస్తాన్ చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు హద్దులు నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి

కేసముద్రం : మున్సిపాలిటీలోని కూలీలు ఉపాధి హామీ పనులను కోల్పోయారని, ఇందుకు వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆర్ఐ ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందించారు.

విమల రణదివే బాటలో పయనిద్దాం

నెహ్రూసెంటర్ : మహిళా కార్మిక నాయకురాలు బీటీ విమల రణదివే చూపిన బాటలో పయనిద్దామని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, శ్రామిక మహిళా జిల్లా నాయకురాలు దార స్నేహబిందు అన్నారు. మహిళా కార్మికుల హక్కుల కోసం శ్రమించిన విమల రణదివే జయంతిని గురువారం నిర్వహించారు.

వాటర్ బాటిల్స్ అందజేత

తొర్రూరు రూరల్ : మండలంలోని కర్కాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ సేవా తరుణి ఆధ్వర్యంలో వాటర్ బాటిల్స్, నోట్‌బుక్స్‌లను గురువారం అందజేశారు.

టేకు కలప వేలం

కురవి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల భవనానికి చెందిన టేకు కలపను ఈనెల 16న హైస్కూల్‌లో వేలం వేయనున్నట్లు హెచ్‌ఎం ఎండీ వాహిద్ గురువారం తెలిపారు. పాఠశాల భవనానికి సంబంధించిన గదులను ఇటీవల కూల్చడం జరిగిందన్నారు.

వరిగడ్డి దగ్ధం



డోర్నకల్ : మండలంలోని ఉయ్యాలవాడలో గురువారం ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధమైంది. ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్ ఉయ్యాలవాడ గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కోసం కార్యకర్తలు రోడ్డుపై బాణాసంచా కాల్చగా పక్కనే ఉన్న దాసరి సైదులుకు చెందిన గడ్డి వాముపై పడటంతో రెండెకరాల వరిపంటకు సంబంధించిన గడ్డి కాలిపోయింది. డోర్నకల్ నుంచి ఫైరింజన్ వచ్చి చుట్టు పక్కలు మంటలు వ్యాప్తి చెందకుండా మంటలను ఆర్పారు.

కూలర్ అందజేత

కేసముద్రం : కేసముద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి పలువురు చిన్నారుల తల్లిదండ్రులు కలిసి రూ.5వేల విలువైన కూలర్‌ను గురువారం అందజేశారు. అంగన్‌వాడీటీచర్ రాజమణి, సూపర్‌వైజర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు జ్యోతిబా పూలే జయంతి

మహబూబాబాద్ అర్బన్ : మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను నేడు పండుగగా జరుపుకోవాలని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎం. నర్సింహస్వామి గురువారం తెలిపారు. సభకు నాయకులు, యువకులు భారీగా తరలి రావాలన్నారు.